# ఎటు చూస్తే అటు...



ఎర్రబస్సు వచ్చి కొత్తపల్లి దగ్గర ఆగింది. పక్కింటి వాళ్ళ సహాయంతో బియ్యం మూటలుబస్సులో వేయించిబస్సెక్కి సీట్లో కూర్చున్నాడు నారాయణ. బస్సు బయలు దేరింది. నారాయణ ముఖంలో అలసట కనిపిస్తూ వుంది. అతని మనసంతా అసహనంగానూ బాధగానూ వుంది. అతని బాధకు కారణం లేకపోలేదు.

మధ్యాహ్నం మూడు గంటలకల్లా నారాయణ రాయదుర్గం బయలు దేరాలసుకున్నాడు. ఆ విషయం ఇంట్లో చెప్పాడు. రాయదుర్గం వెళ్ళే బాలాజీ ప్రయివేటు బస్సు అనంతపురంలో అయిదు గంటలకు వొదుల్తుంది. ఆ బస్సు డ్రైవరూ కండక్టరూ నారాయణకు బాగా పరిచయమయ్యారు. అందులో ఐతే ఎక్కువగా లగేజీ తీసుకోరనీ, ఎవరో వొకరు తనతోపాటు అనంతపురం వచ్చి బియ్యం ప్యాకెట్లు ఆ బస్సులో వేసి అట్లే పొలానికి కావలసిన ఎరువుల మూటలు తెచ్చుకొమ్మనీ ఉదయమే తమ్ముళ్ళిద్దరికీ తట్టిచెప్పాడు నారాయణ. ఎటూ వాళ్ళు ఈ రోజోరేపో అనంతపురం వెళ్ళి ఎరువుల మూటలు తప్పక తీసుకురావలసి వుంది. ఆ పనిలో పనిగా తనతోపాటు అనంతపురం వచ్చి బియ్యం ప్యాకెట్లు రాయదుర్గం బస్సులో వేసి వస్తే తనకు శ్రమా తగ్గుతుంది, అమాలీలకిచ్చే కూలీ మిగులుతుందనుకున్నాడతడు. నాలుగు బియ్యం ప్యాకెట్లు ఒక బస్సులో నుండి కిందికి దింపి మరో బస్సులో వెయ్యడానికి ఎంత లేదన్నాయాభై రూపాయలు అమాలీలు డిమాండు చేస్తారనేది అతనికి ఇబ్బందిగా వుంటుంది. అవసరాన్ని బట్టీ, చేతగాని వాళ్ళను చూసీ లగేజి దింపే విషయంలో ఎత్తే విషయంలో అమాలీల నిర్వాకం బాధ కలిగిస్తుంది. వాళ్ళు ఎంత డిమాండు చేసినా ఇవ్వవలసిన పరిస్థితి వుంటుందప్పుడు. వాళ్ళకిచ్చేది మిగిలితే తమ్ముళ్ళు ఎరువులమూటలు పల్లెకు వేసుకొని పోడానికి అయ్యే ఖర్చులకు పనికొస్తుందని అతని ఆలోచన.

నారాయణ ఈ ఆలొచనతోనే ఉదయం తమ్ముళ్ళకు చెప్పాడు. తీరా బయలుదేరే సమయానికి ఇద్దరూ ఇంట్లో లేరు. చిన్నోడు చెప్పకా చెయ్యకుండా గార్లదిన్నెకు మ్యాట్నీకి వూరేగినాడని తెలిసింది. పెద్దోడు తొందరగా వస్తానని తాటిచెర్లకు జతగాని పెండ్లికి ముస్తాబై పోయి ఇంకా రానేలేదు. ఇదంతా నారాయణకు బాధ కలిగించింది. వాళ్ళ నిర్లక్ష్యం తలచుకునే కొద్దీ వొళ్ళంతా మండింది.

బస్సు డొక్కుదయినట్లుంది. కుంటి నడకలు పోతూవుంది. డ్రైవర్ జవ సచ్చినవాని మాదిరి ఉన్నాడు. కుక్కపిల్ల ఎదురయినా స్లో చేస్తున్నాడు. నారాయణ మాటిమాటికీ టైం చూసుకుంటూ చిరాకు పడుతున్నాడు. అతని మనసంతా గజిబిజిగా వుంది.

తాను చేస్తున్నది ఎలిమెంటరీ స్కూల్ టీచర్ ఉద్యోగమయినా తమ్ముళ్ళకు ఎంతో సహాయం చేస్తున్నాడు తాను. అయినా వాళ్ళకు తృప్తిలేదు. తాను నీడ పాటున సుఖంగా వున్నానన్న అభిప్రాయం తన ఎదుట వ్యక్తం చెయ్యకపోయినా వాళ్ళ మనసుల్లో గట్టిగా వుందని అతనికి తెలుసు. అయితే తాను పడుతున్న అవస్థలు మాత్రం వాళ్ళకు తెలియవు. ఇంట్లో ముగ్గురు పిల్లలూ భార్యా తల్లీ మొత్తం ఆరుమంది. పిల్లల చదువుల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఇంటి బాడుగ ప్రతినెలా ప్రాణాలు తోడేస్తుంది. బజార్లో ఏది కొనాలన్నా అందలమెక్కి కూర్చుంటూ వుంది. కేవలం జీతం రాళ్ళను నమ్ముకొని బతికే బడిపంతుల జీవితాలు దుర్భర మవుతున్నాయి. అయినా వ్యవసాయ జూదంలో నిరంతరం వోడిపోతున్న రైతుల కంటే తనబతుకు ఎంతో మేలనుకొని వచ్చే జీతంతోనే జాగ్రత్తగా సంసారాన్ని నెట్టుకు వచ్చాడు తను. ఈ రోజు ఆ ఉద్యోగం ఉండడం వల్లనే తమ్ముళ్ళు బతకడానికి కాసింత భూమిని తాను తీసివ్వగలిగాడు. అయినా వాళ్ళకు తృప్తిలేదు. వొళ్ళు వొంచకుండా నీడన కూర్చొని జీవితం గడపాలని చూస్తారు. ఏమీ కష్టపడకుండా, పక్కన తెల్లగా పుల్లగా వున్న ప్రతి మనిషినీ వాడేదో దోపిడీ చేసి సంపాదిస్తున్నట్లు అనుకోవడం సోమరిపోతులకు సహజమై పోయింది.

బస్ హార్న్ గట్టిగా వినవడడంతో నారాయణ ఆలోచనల్లోనుంచి బయటపడి చూశాడు. బస్సు అనంతపురం పాత బస్‌స్టాండ్ దగ్గరికి వచ్చి ఆగింది. అవతల బాలాజీ బస్సు ప్యాసింజర్లతో కిక్కిరిసి రాయదుర్గం బయలు దేరడానికి సిద్ధంగా వుంది. నారాయణ తొందరతొందరగా బస్సు దిగి హ్యాండ్‌బ్యాగు కిందపెట్టి పక్కనున్న నాజూకు మనుషులు తన వైపే చూస్తున్నా, తాను వేసుకున్న శ్లాగూ ప్యాంటూ తనను ఆ పని చేయ్యడం బాగుండదని సిగ్గు సిగ్గుగా చెప్తున్నా అవేమీ పట్టించుకోకుండా బస్సుడోరు గుండా బియ్యం ప్యాకెట్టు నాలుగూ కిందికి తోసేశాడు. అట్లా చెయ్యడానికి వాటిని బస్సులోపల

మనుషుల్లోని కృతఘ్నతనూ స్వార్థాన్నీ అవకాశవాదాన్నీ అసహ్యించుకున్నాడు. కుటుంబ సంబంధాలలో వస్తున్న మార్పులనూ దిన దినానికీ మాసిపోతున్న మానవ సంబంధాలనూ తలచుకొని వేదన చెందాడు.



# శాంతి నారాయణ



వేసుకోవడం వల్లనే వీలు కలిగిందనీ అందువల్ల కొంతయినా అమాలీ ఖర్చు మిగిలిందని వూరట చెందాడు.

మూటల్ని చూడగానే ముగ్గురు నలుగురు అమాలీలు చుట్టుకొని 'యా బస్సుకు యెయి మంటారా సార్' అంటూ తొందర చేయ సాగారు. నారాయణవాళ్ళను అక్కడే వుండమని చెప్పి తొందర తొందరగా బాలాజీ బస్సు దగ్గరికి వెళ్ళి కండక్టర్ని కలుసుకొని నాలుగు ప్యాకెట్లు బియ్యం వున్నాయని చెప్పాడు. బస్సులోపల కాలు పెట్టడానికే సందులేదని, టైం అయిపోయిందని బియ్యం మూటలు త్వరగా బస్సుపైన వేయించమని చెప్పాడు కండక్టరు. నారాయణ తల వేడెక్కింది. తప్పదను కున్నాడు. వేరే బస్సు అయివుంటే అప్పుడు తనకోసం ఆగివుండేది కాదనుకుంటూ మూటల దగ్గరికి వచ్చేలోగానే ఒక అమాలీ బియ్యం మూటనెత్తుకొని తనవైపు రాసాగాడు. కూలీ మాట్లాడకుండానే ఇదేమిటని వాని

కొప్పడ్డాడు నారాయణ. 'పరంలేదులే సార్, చూసి ఈయండి' అని రెండోవాడు మరోమూటనెత్తుకున్నాడు.

నారాయణకు అమాలీల అగాయిత్యం బాగా తెలుసు. అందుకే కూలీ ఎంతో ఖచ్చితంగా చెప్పమని అడిగాడు. యాభై రూపాయలిమ్మన్నారు. వాళ్ళు. అతని తల తిరిగిపోయింది. బస్సులో రాయదుర్గం వెళ్ళి. తిరిగి అనంతపురం వచ్చినా అంత ఖర్చు కాదు. నాలుగు బియ్యం ప్యాకెట్లు బస్సుమీద వేయడానికి యాభై రూపాయలా ? ఎంత అన్యాయం అనుకున్నాడు నారాయణ. ఇవ్వడానికి మనసు రాదు. ఇవ్వకుంటే వీల్లేదు. ఏవిం చేయాలో దిక్కుతోచలేదు నారాయణకు. మనసంతా ఆందోళన చెందింది. అదే తనవూరిదగ్గరై వుంటే ప్యాంటూ శ్లాగూ విప్పదీసి పక్కన పడేసి వీపుమీదికెత్తుకొని నాలుగు మూటల్నీ ఐదు నిమిషాల్లో బస్సుపైకి వేసి వుండేవాడే. అతనికి తనపని చేసుకునే విషయంలో బిడియమూ టెక్కూ అట్లాంటివేమీ లేవు. కానీ ఇప్పటి పరిస్థితి వేరు. టౌన్లో బజార్లో అంతమందున్న సభ్యసమాజం ముందు తన వూరి దగ్గర చేసినట్లు చెయ్యలేడు కదా!

నారాయణ కాసేపు మథన పడ్డాడు. వాడు కాకుంటే మరొకణ్ని పిలిచి మాట్లాడడానికి టైం లేదు. పైగా బస్ స్టాండులో ఒక అమాలీ బేరం కుదరక వొదిలేసిన పనిని మరొక అమాలీ చెయ్యడానికి ముందుకురాడు. వాళ్ళకున్న ఐకమత్యం అలాంటిది. అన్నీ ఆలోచన చేసిన నారాయణ, తాను బస్సులోనుంచీ మూటలు కిందికి దింపిన కూలితీసివేసి పద్దైదురూపాయలిస్తానన్నాడు. వాళ్ళు చులకనగా అతనివైపు చూస్తూ మూటలు కిందపడేశారు. తననే పైకెత్తి కింద పడేసినంతగా బాధపడ్డాడు నారాయణ. మూటలు పగిలి పోయాయేమో తడిమి తడిమి చూశాడు. అదృష్టవశాత్తు పగల్లేదు. ఒక మూట చిన్నగా చిట్లిపోయింది. ఒకవేళ పగిలిపోయినా వాళ్ళను తానేమీ చెయ్యలేడు. చిట్లిపోయిన మూటను చూసి కోపంతో వుడికి పోయాడు. పక్కనే నిల్చుకొని ఎగతాళిగా చూస్తున్న అమాలీని ఉడ్చి నాలుగు తన్నులు తన్నాలనిపించింది నారాయణకు. కానీ ఏమీ చెయ్యలేని అసహాయస్థితి.

దూరంగా వున్న మరో అమాలీని పిలిచాడు నారాయణ. వాడు వీళ్ళ వైపు చూసి ఏదో సైగ చేసి అటువైపు తిరిగాడు. ఇంక తప్పదనుకున్నాడతడు. మనసుకు కష్టం కలిగించిన వాళ్ళనే మళ్ళీ అడిగాడు. వాళ్ళు అతని చేతగాని తనాన్నీ ఆదుర్దానూ తెలుసుకొని ముప్ఫై ఇస్తే వేస్తాం లేకుంటే లేదన్నారు. అతని మనస్సు నీరసంగా సరేనంది.

బాలాజీ బస్సు బయలు దేరింది. మనుషుల మధ్య ఇరుక్కొని వొంటికాలిమీద నిల్చుకుని అవస్థ పడుతున్న నారాయణను చూసి ఎవరో ఒక శిష్యుడు పైకి లేచి సగౌరవంగా అతన్ని పిలిచి సీటిచ్చాడు. నారాయణ కష్టపడి సీట్లో కూర్చొని ఊపిరి పీల్చుకున్నాడు.

> **ఏమీ కష్టపడకుండా, పక్కన తెల్లగా పుల్లగా వున్న ప్రతి మనిషినీ వాడెదో దోపిడీ చేసి సంపాదిస్తున్నట్లు అనుకోవడం సోమరి పోతులకు సహజమైపో యింది.**

చెమట పట్టిన ముఖాన్ని తుండు గుడ్డతో తుడుచుకుంటూ కళ్ళు మూసుకొని తన్ను తాను చూసుకున్నాడు నారాయణ. బట్టతల మీద వెంట్రుకలు వికారంగా, రేగడి పొలంలో పంట వొడువుకున్న తర్వాత అక్కడక్కడ జారి పోయిన దనియాల పుల్లల మాదిరి కనిపిస్తున్నాయి. కోపంతో బాధతో అలసటతో ముఖమంతా పీక్కుపోయింది. కళ్ళు గుంతలు పడ్డాయి. బట్టలు నలిగిపోయాయి.

తన ఆకారం; దైన్యం ఎదుటివానికి ఎలా కనిపిస్తుందో ఏమో కానీ తనకేమో అసహ్యంగానే వుంది. అమాలీలతో మాట్లాడేటప్పుడూ , కండక్టర్ని పలకరిస్తున్నప్పుడూ అంత దేవురించడమెందుకో తన కర్థం కాదు. బహుశా తన ఉద్యోగమూ తన ఆర్థిక పరిస్థితులూ అందుకు కారణం కావచ్చు. నిజమే మరి, ఇరవై రూపాయలు మిగిలితే పిల్లలకు రెండు నోటుబుక్కులకు పనికి వస్తుందనుకుంటాడు తాను. పొలంలో ఒకరోజు కలువుతీసే ఆడమనిషికి సరిపోతుందనుకుంటాడు. చేస్తామన్నా చెయ్యడానికి కూలి దొరకక, రోజంతా పనిచేసినా ఇరవై రూపాయలు ఇచ్చే నాథుడు లేక పల్లెల్లో పేదవాళ్ళు అవస్థపడుతూవుంటే ఇక్కడఎదుటివాని చేతగాని తనాన్ని అవసరాన్ని ఆసరాగా చేసుకొని ఐదు నిమిషాల పనికి నలభై యాభై రుపాయలడిగితే అర్థముందా? ఎంత కష్టం చేసి బతికే వాళ్ళయినా నీతి వుండద్దా? నిజమే, వీళ్ళు ఇట్లా తయారవడానికి సమాజమే కారణం కావొచ్చు. సమాజంలోని అసమానతలే మూలం కావొచ్చు. అట్లని తెల్లబట్టలు వేసుకున్న వాళ్ళందరినీ దోపిడిదారులనుకొని సమయం చూసి ఇట్లా ప్రవర్తించడం మంచిదా? దీని వల్ల వాళ్ళమీద తనలాంటి వాళ్ళకు సానుభూతి బదులు అసహ్యమే కలుగుతుంది. అక్రమంగా సంపాదించే వాళ్ళయితే వీళ్ళు అడిగినంతా ఇవ్వగలరేమో కానీ తానెక్కడ ఇవ్వగలడు? అనవసరంగా ఒక రూపాయ ఖర్చు పెట్టాలన్నా బాధగానే వుంటుంది తనకు. అట్లాంటి తాను పది రుపాయల పనికి యాభై అడిగితే ఎందుకివ్వాలనే అడిగే ధైర్యమూ లేక, ఆ పనిని స్వయంగా చేసుకునే సమయమూ సందర్భమూ లేక వాళ్ళడిగినంత ఇవ్వడానికి మనసూ రానప్పుడు తన ముఖమ్మీద దైన్యం కాక మరేది కనిపిస్తుంది?

కాసేపయ్యాక తన్నుతాను పరామర్శించడం మానేసి కళ్ళు తెరిచాడు నారాయణ. మధ్యాహ్నం వల్లె దగ్గర బయలుదేరి అనంతపురంలో బస్సెక్కేవరకూ జరిగిందంతా జ్ఞప్తికి తెచ్చుకొని తమ్ముళ్ళను తిట్టుకున్నాడు. మనుషుల్లోని కృతఘ్నతనూ అవకాశవాదాన్నీ అసహ్యించుకున్నాడు. కుటుంబ సంబంధాలలో వస్తున్న మార్పులనూ దినదినానికీ మాసి పోతున్న మానవ సంబంధాలనూ తలచుకొని వేదన చెందాడు. మనసంతా గజిబిజి కావడంతో ఎంతసేపు బాధపడ్డాడోయేమోకానీ బస్సు ఆగగానే కిటికీ గుండా బయటికి చూసి కళ్యాణదుర్గం వచ్చిందనుకున్నాడు నారాయణ.

ప్యాసింజర్లు చాలామంది దిగిపోవడంతో బస్సులో రద్దీ బాగా తగ్గింది. ఉన్న వాళ్ళందరూ సీట్లల్లో కూర్చొని ఊపిరి పీల్చుకున్నారు. ఆ బస్సు అక్కడ అర్ధగంటసేపు ఆగుతుంది. నారాయణ తన సీటు మీద బ్యాగుపెట్టి చూస్తుండమని పక్కనున్న మనిషితో చెప్పి కిందికి దిగి యూరినల్స్‌కి వెళ్ళి వచ్చాడు. అంతలోనే అమరాపురం బస్సువచ్చి తమ బస్సు పక్కన ఆగింది. దాన్ని చూడగానే


## నిజాయితీగా కష్టం చేసిబతికే పేదవాళ్ళ జీవితంలో ప్రతి రూపాయీ ఎంతో విలువయింది.

బస్‌స్టాండ్‌లోవున్న మనుషులు బిలబిల వచ్చి సీట్లకోసం బస్సుచుట్టూ చుట్టుకున్నారు. ఎన్నో పనులమీద టవునుకు వచ్చిన పల్లెల వాళ్ళందరూ ఆదరాబాదరా వచ్చి బస్సెక్కుతున్నారు. కొంతమంది నెత్తిమీద సరుకుల మూటలెత్తుకొని పారిపారి వస్తున్నారు. మరికొంతమంది ఒక చేతిలో చిన్నచిన్న కిరాణా సంచులూ మరొక చేతిలో సీసాలూ తగిలేసుకొని తాపత్రయపడుతూ వస్తున్నారు. నల్లగా మాగిపోయిన దారాల వురుల మధ్య సీసాలు వొకటికొకటి రాసుకుంటూ మెల్లగా శబ్దం చేస్తున్నాయి. జిడ్డుతో మైలపడిపోయిన సీసాల్లో మంచినూనె కాసింత, ఆముదం రవంత, కొబ్బరినూనె చిటికెడు, గ్లాసెడు కిరసనాయిలూ కనిపిస్తున్నాయి. ఒక్కొక్కరి దగ్గరున్న సరుకంతా లెక్కవేస్తే పది రుపాయల విలువ కూడా చెయ్యదేమో! ఆ మాత్రానికే సంత చెయ్యడానికి టవునుకురావడం ఎంతో సంబరం వాళ్ళకు.

ఒకవైపు దొబ్బుడు బండ్లమీద కలమాగిపాయిన అరటిపండ్లూ, ద్రాక్ష జామ పండ్లూ మాగు వాసన గుమ్మరిస్తున్నాయి. పళ్ళమీద వాలుతున్న ఈగలు రాగాలు తీస్తున్నాయి. అరటిపండ్ల వాడు డజను మూడు రూపాయలంటూ కేకలు వేస్తున్నాడు. ఒక పల్లెటూరి ముసిలోడు ఆత్రంగా అక్కడికొచ్చాడు. తలమీద రుమాలుగా చుట్టుకున్న పాత పచ్చడం అక్కడక్కడ చిరుగులు పడివుంది. భుజమ్మీదున్న తుండుగుడ్డలో వెనక పక్క ఏవో సరుకులు వచ్చు, కట్టుకొని పట్టుకున్నాడు. వొంటిమీద తేపలు వేసి కట్టుకున్న చేతుల బనియను, నడుము కింద మోకాళ్ళ వరకున్న ముతక సల్లడం అతని పేదరికాన్ని ఎత్తి చూపుతున్నాయి. కాళ్ళల్లోని చెప్పులకు ఎన్ని అతుకులో లెక్కవేస్తే తప్ప తెలియదు. కాళ్ళమీద పేరుకున్న దుమ్ము తమలపాకు మందమంతవుంది.

'డజను రొండ్రుపాయిలు సేసుకొని వొగరొండు డజన్లు కట్టు సావుకారీ' అంటూ ముసిలోడు అరటి పండ్లవాన్ని అడుగుతున్నాడు. అతనికి తాను తప్పా ప్రపంచంలో అందరూ షావుకార్లే. టవున్లో అందరూ పెద్దోళ్ళే.

అరటి పండ్లవాడు ముసిలోణ్ణి చూసి ఎగతాళి చేస్తున్నాడు. ముసిలోడు బ్రతిమాలుతున్నాడు. చివరికి డజను రెండున్నర ప్రకారం తీసుకొని భుజమ్మీదున్న తుండుగుడ్డ రెండోపక్క మూటగట్టుకొని భుజమ్మీద దిగేసుకున్నాడు. సల్లడం లోపల వేలాడేసుకున్న చిన్న సంచిలోనుంచి చిల్లర బయటికి తీసినాడు. లెక్కపెట్టిందే రెండుమూడుసార్లు లెక్కబెట్టి చేతిలోవున్న చిల్లరవైపు గుడ్లప్పగించి చూస్తూ నీళ్ళు నములుకుంటూ అతికష్టం మీద పండ్లవానికిచ్చి అమరాపురం బస్సు దగ్గరికెళ్ళాడు.




నిజాయితీగా కష్టంచేసి బతికే పేదవాళ్ళ జీవితంలో ప్రతిరుపాయీ ఎంతో విలువయింది. అదీ పల్లెటూరివాళ్ల జీవితంలో అయితే చెప్పనవసరమేలేదు. పది పైసలు ఖర్చుపెట్టాలన్నా ముందూవెనకా చూస్తారు. ప్రతి చిన్న పనికీ మురికి నీళ్ళప్రాయంగా డబ్బు ఖర్చు చెయ్యడమంటే వాళ్ళకు చాలా బాధకలుగుతుంది. కష్టం లేకుండా సునాయాసంగా నిమిషాల మీద కష్టానికి మించిన డబ్బు సంపాదించడమనేది వాళ్ళ వూహకందదు. అది ఏ రూపంలో ఎవరు చేసినా భరించలేరు.

నారాయణ పల్లె జీవితం నుండి పైకి వచ్చినోడు. నిజమయిన కష్టజీవుల బతుకు విధానాలు అతనికి బాగా తెలుసు. ప్రతి చిన్న విషయాన్ని సూక్ష్మంగా పరిశీలించడం అతనికి అలవాటు. కళ్ళముందు, మనసును తాకే సంఘటనలను చూసీ చూడనట్లు పోయే తత్వం కాదతనిది.

అరటి పండ్లవానితో 'గోజిగొజి' బేరమాడి పండ్లు మూటగట్టుకొని వెళ్ళిన ముసలోణ్ణి జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఆ దయనీయమయిన బతుకులను గురించి విశ్లేషించుకుంటూ మెయిన్‌రోడ్లోవున్న హోటల్‌కెళ్ళి కాఫీ తాగి వస్తున్నాడు నారాయణ. ఇద్దరు పల్లెటూరి రైతు కూలీలు కొట్టాలకు కావలసిన తడకలు, సరుగుడు కట్టెలు, వెదురు బొంగులు రెడీమేడ్ తలుపులూ వొంటెద్దు బండిమీద వేసుకొని వచ్చి అమరాపురం బస్సుపైకి వెయ్యడానికి చూస్తున్నారు. ఒకడు బస్సు పైకెక్కి అందుకుంటున్నాడు. కిందున్నవాడు బండ్లోవున్న వస్తువుల్ని పైవానికి అందిస్తున్నాడు. బండివాడు దూరంగా నిలబడి మరొక బండివానితో కలిసి టీ తాగుతున్నాడు. అంతలో ముగ్గురు మనుషులొచ్చారు. ఒకడు బాగా తాగిన మత్తులో వున్నాడు. మరొకడు సిగరెట్ తాగుతూ దగ్గుతున్నాడు. ఇంకొకడు జర్దా నములుతున్నాడు. ముగ్గురూ కలిసి బస్సు మీదికి తడకలు వేస్తున్న వాళ్ళను అడ్డగించారు. బస్‌స్టాండులో అమాలీలు తప్ప వేరే వాళ్ళు బస్సుల మీదికి సామాన్లు వెయ్యడంగానీ దించడంగానీ చెయ్యకూడదన్నారు.

'ఈ సామాన్లు మావయ్యా. మాపని మేం చేసుకుంటాంటే మీకేమీ'? పల్లెటూరివాళ్ళు జవాబిచ్చారు.

'అందరూ ఇట్లనే అంటారయ్యా. ఆ సాములు బయట నుంచీ మనుసుల్ని తెచ్చుకొని పనులు చేయిచ్చుకుంటే ఇంగ మేమెందుకు ఇక్కడుండల్ల?' తాగే సిగరెట్టును పక్కకు విసిరేసి ప్రశ్నించాడు అమాలీ.

'మేము కూలికి రాలేదయ్యా! మేమూ మీ మాదిరి పేదోల్లమే. కొట్టానికని మేమే ఇవన్నీ సొంతం యేసకపోతాండాం. మా పని గూడా మమ్మల్ని చేసుకోనీకుంటే యెట్ల? మేము సావుకార్లము కాదు నాయినా, కూలిచ్చి మీతో పని చేయిచ్చుకోడానికి!' ఉన్న విషయం చెప్పారు వాళ్ళు.

'అదంతా - జాంతానై. బస్సుమిందికి మాత్తరం మీరు సామాన్లు మోయిడానికి ఈల్లేదు, ఆ‹ --' తాగినోడు ముందుకొచ్చాడు. అందరూ కలిసి వాళ్ళచేతుల్లో వున్న తడకల్ని

లాగి కిందపడేసి, అవన్నీ పైకి వెయ్యడానికి నలభై రుపాయలవుతుందని, అంతగా అయితే వొక అయిదు రుపాయలు తక్కువ చేసుకొని ఇవ్వండని డిమాండ్ చేశారు. చూస్తుండ గానే అమాలీలూ వొంటెద్దు బండివాళ్ళూ అందరూ ఏకమయ్యారు. తలాకొక మాట మాట్లాడుతున్నారు.

ఆ పల్లెటూరి వాళ్ళ ముఖాల్లో రక్తం లేదు. చవ్వబడిపోయారిద్దరూ. ఏమి చెయ్యాలో దిక్కుతోచలేదు వాళ్ళకు. కోపమూ బాధా పెదవుల కింద నలిగి పోతున్నాయి. చేతగాని తనం వాళ్ళ కళ్ళల్లో కనిపిస్తూ వుంది. అనువుగాని చోటు. బతుకు నిండా పేదరికం. కోపాన్ని పళ్ళకిందనే అణచుకోకుండా ఏం చేయగలుగుతారు?

అంతా గమనిస్తున్న నారాయణ భరించలేక ముందుకెళ్ళి 'ఏమిటయ్యా ఈ దౌర్జన్యం?' అంటూ ఏదో చెప్పబోయాడు. గుంపులో నుంచి వొకడు, 'నీయంతకు నువ్వు నోరు మూసుకొని పోవయ్యా, పెద్ద న్యాయం చెప్పడానికొచ్చినావు?' అంటూ తన్నే వానిలాగా దగ్గరికొచ్చాడు. నారాయణ నిరుత్తరుడయిపోయాడు. ఏమి మాట్లాడినా అక్కడ తనకు దక్కేది అవమానమే అనుకొని 'ఎంతన్యాయమయ్యా' అని గొణుక్కుంటూ బాలాజీ బస్సు దగ్గరికెళ్ళాడు.

నారాయణ శరీరం కోపంతో వుడికి పోతూవుంది. పళ్ళు బిగుసుకుపోతున్నాయి. మనసు మధన పడసాగింది.

'ఎంతదౌర్జన్యం? ఒక పేదవాని మీద పేదవాడే దౌర్జన్యం చేస్తూవుంటే వీళ్ళను గురించి ఏమనుకోవాలి? ఇంకా ఈ దేశంలో బడుగు వర్గాలలో నైతిక విలువలు మిగిలి వున్నాయనుకుంటే అది పొరపాటేనా? ఏదో ఒక రోజు ఈ సమాజ రూపురేఖలు మార్చేది బడుగు వర్గాల వాళ్ళే అనుకుంటే వీళ్ళలో కూడా అవలక్షణాలన్నీ చోటు చేసుకుంటున్నాయే! కుష్ఠువ్యాధిలాగా వ్యాపిస్తున్న దుష్ట సంస్కృతి, సంఘ శరీరంలో ఏ భాగాన్నీ ఆరోగ్యంగా వుండనీదేమో!' ఆలోచనలతో అతని తల వేడెక్కుతూవుంది.

బాలాజీ బస్సు ఇంకో రెండు నిమిషాల్లో రాయదుర్గం బయలుదేరడానికి రెడీగా వుంది సడన్‌గా ఏదో స్ఫురించినట్లయితే, ఒకసారి బస్సుపైనున్న బియ్యం మూటల్ని గమనించడం మంచిదనుకొని పైకెక్కి చూశాడు నారాయణ. అక్కడ బియ్యం మూటలు లేవు. ఆశ్చర్యపోయాడు. షాక్ కొట్టినట్లయింది. ఒళ్ళంతా కంపించిపోయింది. బిరబిర కిందికి దిగి అటువైపు పరుగెత్తిపోయి చూశాడు. బియ్యం మూటలు చిందరవందరగా కిందపడి వున్నాయి. రెండు మూటలు పగిలి బియ్యం సుమారుగ కిందికి కారిపోయాయి. వాటిని చూడగానే అరికాల్లో నుంచి మండింది నారాయణకు. పక్కన నిల్చుకున్నది అమాలీలే అనుకొని 'ఎవడయ్యా ఈ మూటలు కిందికిదించింది?' అంటూ కోపంగా అడిగాడు.

'మేమేనయ్యా, మా షావుకారి ఈ బస్సులో బియ్యం మూటలొస్తాయని చెప్పింటే దించినాము' నిర్లక్ష్యంగా చెప్పారు వాళ్ళు.

'బుద్ధుందేమయ్యా? దించేటప్పుడున ఈ మూటలు ఎవరివని అడిగే పని లేదా?' రేగి పడ్డాడు నారాయణ.

'వాళ్ళతో గొడవవద్దండి సార్, వూరికే అంతోయింతో ఇచ్చి మూటలు పైకి వేయించుకోండి. బస్సుపైన ఏవైనా వేస్తే ప్రతి స్టేజి దగ్గరా గమనిస్తూ వుండల్ల సార్' అంటూ కండక్టర్ దగ్గరకొచ్చి చెప్పాడు. నారాయణ కండక్టర్ మీద కోప్పడ్డాడు. రూల్సు మాట్లాడాడు. కండక్టర్ మవునం వహించాడు.

'ఇపుడేవయ్యా, పొరపాట్న దించినాము అయితే మాత్తరం శానా యిదిగా మాట్లాడ తాండావే' అంటూ జబర్దస్తీ చేశాడు అమాలీలు. ఇద్దరి మధ్యా మాటలు పెరిగాయి. జనమంతా గుంపయ్యారు.. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. విషయం తెలిసినా అందరూ నోర్లు తెరుసుకొని చూస్తూ బొమ్మల మాదిరి నిలబడ్డారు. కళ్ళముందు ఏం జరుగుతున్నా కబోదులై చూడడానికి అలవాటు పడిన ఆ మనుషుల మధ్య నారాయణ నోరు ఎండుకు పోయేలాగా అరుస్తున్నాడు.

అక్కడున్న ఆ మాలీలకు తోడుగా పక్క బస్సు దగ్గరున్న వాళ్ళు కూడా జతయ్యారు. అందరూ నారాయణ మీద విరుచుకు పడ్డారు. 'ఏందయ్యా, మర్యాదగా మాట్లాడు. ఎక్కువ మాట్లాన్నావంటే ఇక్కన్నుంచి పోలేవు. యాభైరుపాయలు అడపెట్టు, మూటలు పైకేస్తాం, అంతే' అంటూ దౌర్జన్యం చేశారు. ఆ మాటలు వినగానే నారాయణ నిశ్చేష్టుడయి పోయాడు.

# నాకు నువ్వున్నావు

వి. ప్రతిమ



నాకెవ్వరూ లేరు
నా మనసు యధాతథంగా
విప్పి పరవడానికిక్కడెవ్వరూ లేరు, లేనే
లేరనుకున్నానా .... కాదు
నువ్వున్నావు నాకు
నీ ఆసరా వుంది, నీ ఓదార్పుంది
నీ ఒడిలో సేదతీరే ఆశవుంది
నా బాధల్నీ, గాయాల్నీ, కష్టాల్నీ
ఎన్నింటినయినా
నా గుండెల్లో నుండి నీ గుండెలోకి
ఒలికింపజేసుకునే ఆర్తి నీలోవుంది.
రక్తసిక్తమైన నాగుండెగది నిండివున్న
వికృత ఆకృతుల్ని సమాధి చేసి
నాకు ప్రశాంతి నిచ్చే నేర్పునీకుంది
నాకు నిజంగా నువ్వున్నావు.
నువ్వు, నా నువ్వు
నువ్వెప్పుడూ నా బతుకు ముంగిట్లో నిలబడి
జ్వలిస్తూనే వుంటావు క్షణం క్షణం దగ్గరవుతూ .... అవుతూ.

నాకెప్పటికయినా నువ్వే వున్నావు అన్నింటికీ
అయితే
గాయాల దుప్పటి కప్పుకుని నేను
వణుకుతున్నంత దాకా నువు రావు.
మెలికలు ..... మెలికలుగా పాక్కుంటూ
నువ్వొచ్చే వేళకి
గాయాలుండవు ..... నేనుండను.

* *